# కొత్త చిగురు

- గన్నవరపు నరసింహమూర్తి

'చందన చర్చిత నీలకళేబర పీతవసన వనమాలీ!'

పల్లవి గొంతులోంచి ఆ జయదేవుని అష్టపది అమృతధారలా పెల్లుబికి వస్తోంది. ఆమె పాడుతుంటే మిగతా అమ్మాయిలు లయ బద్ధంగా చేతులతో తాళం వేస్తూ ఆమెకు సహకరిస్తున్నారు. పాట పూర్తయిన తరువాత వెంకట్రావు మాస్టారు ఆనందంతో-

"బాగా పాడావు తల్లీ! అందుకే నిన్న క్రమం తప్పకుండా సంగీతం నేర్చుకోమంటున్నాను. కానీ మీ నాన్నకు ఇష్టంలేదు. ఏం చేస్తాం?" అన్నాడు విచారంగా.

పల్లవికి ఆ మాటలు విన్న తరువాత తండ్రి గుర్తుకు వచ్చాడు. ఆమె తండ్రి రఘురామయ్యకి కూతురు సంగీతం నేర్చుకోవడం సుతరామూ ఇష్టంలేదు. ఒక్కగానొక్క కూతుర్ని ఇంజనీరింగ్ చదివించి మంచి వరుడితో పెళ్లి చేసి అమెరికా పంపాలని ఆయన కోరిక.

కానీ ఆయనకి పూర్తి వ్యతిరేకం పల్లవి. చిన్నప్పటినుంచీ ఆమెకు సంగీతం అంటే ప్రాణం. ఏ పాట పాడినా మధురంగా ఉండేది. అది బాల గాత్రం, కొంత వయస్సు వస్తే అది పోతుంది అనుకునేవాళ్లు కూడా లేకపోలేదు. కానీ ఆమె గొంతు మాత్రం వయసుతోపాటు మాధుర్యాన్ని సంతరించుకోసాగింది. ఆ ఊరి అమ్మాయిలంతా సాయంత్రం అయ్యేసరికి ఆ ఊరి హెడ్మాస్టర్ వెంకట్రావుగారింటికి సంగీతం నేర్చుకునేందుకు వెళ్లేవారు.

మొదట్లో అడ్డు చెప్పని రఘురామయ్య ఆమె ఎనిమిదో తరగతికి వచ్చేసరికి వెళ్లడానికి వీల్లేదని అడ్డు చెప్పాడు. సంగీతంవల్ల చదువుకు ఆటంకం కలుగుతుందన్నాడు.

పల్లవికి చిన్నప్పటినుంచీ తండ్రి అంటే విపరీతమైన భయం.

ఆమెకే కాదు, ఆమె తల్లి జానకికి కూడా భర్త అంటే భయమే. అతనికి ఎదురు తిరిగి మాట్లాడే ధైర్యం ఆ ఇంట్లో వారికే కాదు, ఆ ఊళ్లో వాళ్లకే లేదు.

దానికి కారణం రఘురామయ్య ఆ ఊరికి మోతుబరేకాదు, ప్రెసిడెంట్ కూడా. ఆ ఇంట్లో అన్నీ ఉన్నా పల్లవికి లేనిది స్వేచ్ఛ. ఆమె రోజూ పెరట్లోని ఎండిపోయిన చెట్టును చూసినప్పుడల్లా తన జీవితం కూడా ఆ మోడులాగే వాడిపోతోంది అని వాపోతుండేది.

పల్లవి ఇప్పుడు పదో తరగతి చదువుతోంది. తండ్రికి ఎప్పుడూ ఆమె చదువు గురించే ఆలోచన. కానీ ఆమెకు మాత్రం సంగీతం నేర్చుకోవాలని ఉండేది.

అందుకే తండ్రికి ఇష్టం లేకపోయినా టీవీల్లో వచ్చే సంగీత ప్రధానమైన అన్ని కార్యక్రమాలూ చూసేది. ప్రతిరోజూ తండ్రికి తెలియకుండా మాస్టారింటికి దొంగతనంగా వెళ్లి సంగీతం నేర్చుకునేది.

ఆమె తండ్రికి తెలియకుండా సంగీతం నేర్చుకునేందుకు వస్తుండడంవల్ల వెంకట్రావు మాస్టారుకి లోలోపల ఆందోళన ఉన్నా ఆమెకు సంగీతంపై వున్న మక్కువవల్ల సంగీతం నేర్పిస్తూ ఉండేవాడు.

ప్రతిరోజులాగే పల్లవి ఆ రోజు మాస్టారింటికి వెళ్లి చీకటి పడడంతో ఇంటివైపు బయలుదేరింది. దారిలో తండ్రి ఎదురు కావడంతో ఆమెకు ఏం చేయాలో తోచలేదు.

తను మాస్టారింటి నుంచి వస్తున్నట్లు తండ్రికి తెలిసిపోయినట్లు ఆమె గ్రహించింది. ఇంటికి వెళ్లిన తరువాత తండ్రి ఏం చేస్తాడోనని ఆమెకు భయం వేసింది.

ఇంటికి చేరుకునేసరికి ఆమె మామయ్య విశ్వనాథం పల్లెనుంచి వచ్చాడు. ఆయన అక్కడ మాస్టారుగా ఉద్యోగం చేస్తున్నాడు. తాతయ్యగారిది వ్యవసాయ కుటుంబం కావడంతో ఆమె మేనమామలు ఇద్దరూ కలిసే వుంటారు.

ఆ రాత్రి భోజనాల సమయంలో తండ్రి, మామయ్యల సంభాషణ చాటుగా వినసాగింది.

"ఏం బావా! ఈ సంవత్సరం పల్లవి పదవ తరగతి పూర్తవుతుంది. తరువాత ఏం చేద్దాం అనుకుంటున్నావు?" అడిగాడు విశ్వనాథం.

"ఏం చేయాలో తోచడంలేదయ్యా. దానికి చదువుమీదకన్నా సంగీతం అంటే ఇష్టం. నేను ఎన్నిసార్లు చెప్పినా వినడంలేదు. చాటుమాటుగా వెళ్లి సంగీతం నేర్చుకుంటోంది. పదో తరగతి చదువుతోంది. ఇక్కడ వుంటే దాని చదువు సరిగ్గా సాగదు. అందుకని విశాఖపట్నంలో ఏదైనా రెసిడెన్షియల్ స్కూల్లో జాయిన్ చేయాలని అనుకుంటున్నాను. అప్పటికిగానీ దానికి బుద్ధిరాదు" అన్నాడు ఆవేశంతో.

కూతురు తనకు తెలియకుండా సంగీతం నేర్చుకుంటున్నందుకు ఆయనకు కోపంగా ఉంది.

"సంగీతం నేర్చుకోవడం తప్పెలా అవుతుంది బావా! అది ఒక వరం. నూటికి ఒకరికి కూడా ఆ అదృష్టం దక్కదు. పైగా ఆమె స్వరం ఆమెకు దేవుడిచ్చిన వరం. దయచేసి దాన్ని సంగీతం నేర్చుకోకుండా ఆపొద్దు బావా" అన్నాడు విశ్వనాథం.

"అది కాదు విశ్వం. చిన్నప్పటినుంచీ పల్లవి బాగా చదువుకోవాలనే నా కోరిక. అది బాగా చదువుకోవాలంటే ఈ సంగీతం, పాటలు లాంటివి పనికిరావు. వీటివల్ల దానికి చదువుమీద ధ్యాస తగ్గుతుంది. అందుకే ఇంత కట్టడి. ఒక తండ్రిగా నేను ఇలా చేయడం తప్పంటావా?"

"తండ్రిగా నువ్వు చేస్తున్న పనిని తప్పనను బావా. మనిషికి చదువు ముఖ్యమే. కానీ ప్రతివారికీ తమకంటూ ఇష్టమైన కొన్ని వ్యాపకాలు ఉంటాయి. వాటిని వ్యతిరేకించడం తప్పంటాను.

దానికి చిన్నప్పటినుంచీ సంగీతమంటే ప్రాణం. దాన్నుంచి తనను వేరు చేయకు. నువ్వు అంత కట్టడి చేస్తే మాత్రం దాని చదువు సాఫీగా సాగుతుందా? ఏకాగ్రత కుదురుతుందా చెప్పు? చదువును కూడా పూర్తిగా అనుభవిస్తూ చదివితేనే అది ఒంటబడుతుంది. ఈ విషయం సరే, ముఖ్యంగా నేను ఎందుకు వచ్చానంటే పల్లవిని సెలవులకు మా ఊరు తీసుకువెళ్దామని వచ్చాను. మా తమ్ముడి పిల్లలు, చెల్లెలి కుటుంబం అంతా సెలవులకు వచ్చారు. ఈ సంవత్సరం ఏరు కూడా నిండుగా పారుతోంది. కొన్నాళ్లు మా అందరితో తాతగారింట్లో గడుపుతుంది. కాబట్టి నువ్వు కాదనకుండా పల్లవిని నాతో పంపు'' అన్నాడు విశ్వనాథం.

ఆ మాటలు విన్న రఘురామయ్య ఏం మాట్లాడలేదు. పల్లవి తలుపు చాటునుంచి తండ్రి ఏం చెబుతాడోనని ఉత్కంఠతతో ఎదురుచూస్తోంది.

ఆమెకు మేనమామతో సుభద్రాపురం వెళ్లాలని వుంది. చివరకు రఘురామయ్య సరేనన డంతో ఆమె ఊపిరి పీల్చుకుంది.

★★★

సుభద్రాపురం అందమైన పల్లె. చుట్టూ కంఠాభరణంలా ఏరు. పచ్చని పొలాలు, అందమైన పంట కాలువలతోక కళకళలాడుతోంది ఆ ఊరు. పల్లవికి ఆ ఊరు చాలా నచ్చింది.



ఎప్పుడో చిన్నప్పుడు తన తల్లితో ఆ ఊరొచ్చింది. జ్ఞానమొచ్చిన తరువాత మళ్లీ ఇప్పుడే రావడం. అడ్డురోడ్డు దగ్గర బస్సు దిగి పడవలో ఏరు దాటి వెళ్లడం ఆమెకు మరువలేని అనుభూతినిచ్చింది. ముఖ్యంగా పడమటి దిక్కు సింధూరవర్ణాన్ని సంతరించుకుంటున్నప్పుడు ఆ సంజె కిరణాలు ఏటిపై పరావర్తనం చెందుతుంటే ఒక అందమైన వర్ణచిత్రంలా అనిపించింది.


ఆ ఊరంతా సందడిగా ఉంది. ప్రతీ ఇల్లు వేసవి సెలవులకోసం వచ్చిన చుట్టాలతో నిండి వున్నాయి. తన ఇంట్లోలా కాకుండా తాతయ్యగారిల్లు చాలా సందడిగా ఉంది.

మామయ్యలిద్దరూ తను రావడం చూసి చాలా సంతోషించారు. పెద్ద మామయ్య కూతురు కృతి పల్లవికి బాగా నచ్చింది. ఆమె కూడా పల్లవిలా సంగీతమంటే చెవి కోసుకుంటుంది.

## శిరోజాలు బాగుండాలంటే...

నల్లగా నిగనిగలాడుతూ పట్టుకుచ్చులా మెరిసిపోయే కురులను చూస్తే ఎవరికి ముచ్చటగా అనిపించదు. మీ శిరోజాల నిగారింపును సంతరించుకోవాలంటే ఈ చిట్కాలను కూడా పాటించి చూడండి. తేనె, బాదం నూనె, టీ ఒక్కొక్కటీ కప్పు చొప్పున తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తల కుదుళ్ల నుంచి జుట్టు చివరిదాకా రాసుకోవాలి. అరగంట తరువాత చల్లని నీటితో కడిగేసుకుని ఆ తరువాత క్షార గుణాలున్న షాంపుతో తలస్నానం చేయాలి. దీనివల్ల జుట్టు నిగారింపును సంతరించుకుని పట్టులా మెరుస్తుంది. తలంతా దురద పుట్టి బాధిస్తుంటే కప్పు పుల్లని పెరుగు తలంతా ప్యాక్‌లా వేసుకోండి. ఇది దురదను తగ్గిస్తుంది. తరువాత షాంపుతో రుద్దుకోవాలి. శిరోజాల మెరుపు కోసం షాంపూ చేసుకున్న తరువాత టీ లేదా వెనిగర్ రాసుకోవచ్చు. శిరోజాలు పొడిబారి ఎండుగడ్డిలా మారిఇబ్బంది పెడుతుంటే కొద్దిగా పాలు తీసుకుని తలకు రాసుకోవాలి. తరువాత షాంపుతో తలంటుకోవాలి. పాలు జుట్టును సంరక్షించడమే కాకుండా మెరుపునూ సంతరించుకునేలా చేస్తుంది. నాలుగైదు అరటిపండ్లు మెత్తని గుజ్జులా చేసుకుని దానిని తలకు ప్యాక్‌లా వేసుకోవాలి. పావుగంట తరువాత ముందుగా చల్లని నీటితో కడిగేసుకుని ఆ తరువాత షాంపు వేసుకోవాలి.ఈ ప్యాక్ కూడా జుట్టును మెరిసేలా చేస్తుంది. కండిషనింగ్ కోసం ఏం చేస్తారంటే రెండు గుడ్లను గిలకొట్టి ఆ మిశ్రమాన్ని తలకు రాసుకుని పదినిముషాల తరువాత స్నానం చేయాలి.

-కె.శంకరరావు




చిన్నమామయ్య కూతురు ఆ ఊళ్లోనే తొమ్మిదో తరగతి చదువుతోంది.

ఇక వీధి చివర్న ఉండే చిన్న మేనత్త కూతురు రాగిణి కూడా తన వయస్సుదే.

వాళ్లందరితో కలసి ఉదయాన్నే ఏటికి స్నానానికి వెళ్లింది పల్లవి. జీవితంలో మొదటిసారిగా ఏటిలో ఆనందంగా స్నానం చేసింది. అలా ఎంతసేపు స్నానం చేసినా ఆమెకు తనివి తీరలేదు. ఇంటికి వెళ్ళబుద్ధి కాలేదు. ఇంటికి వెళ్లిన తరువాత అమ్మమ్మ పెట్టిన కమ్మని భోజనం ఆవురావురు మంటూ తింది.

ఆ భోజనం అమృతంలా అనిపించింది. అదే తమింట్లో ప్రతిరోజూ తండ్రి ప్రక్కన కూర్చుని భోజనం చేస్తుంటే భయంతో రుచి తెలిసేదికాదు. ఇక సాయంత్రం ఏటి ఒడ్డున ఉన్న ఇసుకతిన్నెలపై ఎన్నో ఆటలు ఆడారు. ఒక్క రోజులో ఆ ఊళ్లో చాలామంది తనకు ప్రాణస్నేహితులయ్యారు. ఆమెకు ఇప్పుడు జీవితం ఎంత అందంగా, ఆనందంగా అనిపించింది.

★★★

మర్నాడు ఉదయం పల్లవిని విశ్వనాథం మామయ్య శాస్త్రిగారి దగ్గరకు తీసుకువెళ్లాడు.

అతను ఆ ఊళ్లో ఆడపిల్లలందరికీ సంగీతం నేర్పుతూ ఉంటారు. విశ్వనాథం శాస్త్రిగారికి ఆమెని పరిచయం చేసి ఇంక రోజూ ఆమె కూడా సంగీతం నేర్చుకునేందుకు వస్తుందని చెప్పడంతో ఆమె ఆనందానికి హద్దులులేవు. మామయ్య తనకు దేవుడిలా కనిపించాడు.

ఆ రోజు నుండి ప్రతిరోజూ ఉదయాన్నే ఏటిలో స్నానం చేసి అత్తయ్య పెట్టిన టిఫిన్ తిని శాస్త్రిగారింటికి వెళ్లేది. రోజూ రెండుగంటల సంగీత సాధన,

ఆ తరువాత శాస్త్రిగారింటిలోనే చిన్న చిన్న పనులు చేయడం, అతని భార్య సుశీలమ్మకు చేదోడువాదోడుగా ఉండడంతో సమయం తెలిసేది కాదు.

మధ్యమధ్యలో హార్మోనియం వాయించేది. సంగీతంపట్ల ఆమెకున్న మక్కువ చూసి శాస్త్రిగారు ఆమెకు మరింత దీక్షతో నేర్పసాగారు. పదిరోజుల్లోనే కీర్తనల స్థాయి దాటిపోయింది.

ఇప్పుడు ఆమె గొంతులో అన్నమయ్య, త్యాగయ్య కృతులు అలవోకగా పలకసాగాయి.

ప్రతిరోజూ రాత్రిపూట డాబాపై తాతగారింట్లో అందరూ ఆమె కీర్తనలను ఆసక్తిగా వింటూ ఉండేవారు.

ఇదివరకు కొత్తవారి ఎదుట పాడాలంటే భయంగా ఉండేది ఆమెకు. కానీ ఇప్పుడు పల్లవికి భయం పోయింది. దాని స్థానంలో ఆమెకు కాన్ఫిడెన్స్ వచ్చింది.

ఆమె వచ్చిన పదిహేనురోజుల తరువాత ఆ ఊరి హైస్కూల్‌లో జరిగిన ఫేర్‌వెల్ ఫంక్షన్‌లో ఆమెకు మొదటిసారిగా వేదికపై పాటలు పాడే అవకాశం కలిగింది. ఆమె పాటలు ఆ ఊరి శ్రోతలను విపరీతంగా ఆకట్టుకున్నాయి.

ఆ ఊళ్లో తాతగారింట్లో ఆమెకు రోజులు ఇట్టే గడిచిపోతున్నాయి. మేనమామలు, వాళ్ల పిల్లల ఆప్యాయతల వరదలో ఆమె పూర్తిగా మునిగిపోయింది.

రోజులు గడుస్తున్నకొద్దీ తమ ఊరు వెళ్లిపోవాలన్న విషయం గుర్తుకొచ్చి ఆమెకు భయం వేస్తోంది.

తనకు ఇప్పుడు ఇక్కడే ఉండిపోవాలనిపించేది. కానీ అది కుదిరే పని కాదని ఆమెకు తెలుసు.

ఆమె భయపడినట్లుగానే రఘురామయ్య నుంచి ఆ సాయంత్రం ఉత్తరం వచ్చింది. పల్లవిని వెంటనే పంపించమని దాని సారాంశం. ఆ ఉత్తరం చదివిన తరువాత ఆ ఇంట్లో వాతావరణం ఒక్కసారిగా గంభీరంగా మారిపోయింది. ఈ నెలరోజుల్లో ఆమె ఆ ఇంట్లోవాళ్లతో పూర్తిగా మమేకమై పోయింది. పల్లవి లేని ఇంటిని వాళ్లు ఊహించలేకపోతున్నారు.

***

పల్లవి వాళ్ల ఊరికి వెళ్లిపోయే రోజు దగ్గరపడింది. రఘురామయ్య తనే వస్తున్నట్లు మళ్లీ ఉత్తరం రాసాడు. ఆ రోజు ఉదయాన్నే మామూలుగానే సంగీత సాధనకి శాస్త్రిగారింటికి వెళ్లింది పల్లవి.

ఆమెను చూసి శాస్త్రిగారు "ఏం తల్లీ! నువ్వు మీ ఊరు వెళ్లిపోతున్నావ టకదా. మరి కొన్నిరోజులుంటే ఆ మిగతా కృతులు పూర్తయిపోతాయి" అన్నారు.

"నాకూ ఇక్కడే ఉండాలని ఉంది మాస్టారూ. నాకు ఈ ఊరు చాలా బాగా నచ్చింది. అదీగాక సంగీతమంటే నాకు ప్రాణం. కానీ మా నాన్నకు నేను సంగీతం నేర్చుకోవడం ఇష్టంలేదు. తనకు నేను పెద్ద చదువులు చదువుకోవాలని కోరిక. ఇక్కడకొచ్చిన తరువాత మీ దయవలన నేను నాకిష్టమైన సంగీతాన్ని ఎంతో అనుభవించి మరీ నేర్చుకున్నాను. నా జీవితంలో ఈరోజులను మరచిపోలేను మాస్టారూ" ఆ మాటలు అంటున్నప్పుడు పల్లవి కళ్లల్లో స్పష్టమైన తడిని ఆయన గ్రహించారు.

"పల్లవీ! నీలాంటి శిష్యులకు సంగీతం నేర్పడం అంటే నాలాంటి వాళ్లకు ఎంతో ఆనందం కలుగుతుంది. నీలాంటివాళ్లు అరుదుగా దొరుకుతారు. ఈ సుస్వర సంగీతాన్ని ఒక యజ్ఞంలా భావించి నేర్చుకునేవాళ్లు చాలా కొద్ది మందే ఉంటారు. నువ్వెలాగూ ఈవాళో రేపో వెళ్లిపోతావు. అందుకే నువ్వు రోజూ అద్భుతంగా పాడే నగుమోము కీర్తన ఒక్కసారి పాడి వినిపించు తల్లీ" అన్నారు శాస్త్రిగారు.

ఆ మాటలు విన్న పల్లవికి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. సంగీతంలో పండితుడైన ఆయన తనను పొగడుతూ ఆ కీర్తన పాడమనడం ఆమెను ఒకింత విస్మయానికి గురి చేసింది. కొద్దిసేపటికి తేరుకుని ఆమె ఆ కీర్తన పాడడం మొదలుపెట్టింది.

అలా మంద్రంగా మొదలైన ఆ కీర్తన కాసేపటికి తారాస్థాయికి చేరుకుంది. జాలిగొలుపుతూ మృదుమధురంగా సాగుతున్న ఆమె గానం అర్ధాంతరంగా ఆగిపోవడంతో ఆ కీర్తన వింటూ ఏదో లోకంలో విహరిస్తున్న శాస్త్రిగారు ఒక్కసారిగా ఉలిక్కిపడి కళ్లు తెరిచారు. ఎదురుగా పల్లవి తండ్రి రఘురామయ్య కనిపించాడు.

పల్లవి ముఖంలో భయాన్ని స్పష్టంగా చూసారు శాస్త్రిగారు. కాసేపటికి తండ్రీకూతుళ్లు ఇద్దరూ వెళ్లిపోయారు. తండ్రికిష్టంలేని సంగీతాన్ని నేర్చుకుంటూ పట్టుబడిపోయినందుకు ఏం జరుగుతుందోనని ఆమెకు భయమేస్తోంది.

***

మధ్యాహ్నం మూడవుతుండగా తండ్రి బయలుదేరడం ఆమె గమనించి తను కూడా బ్రీఫ్‌కేస్ సర్దుకోసాగింది. ఆమెను రఘురామయ్య పిలిచి చెప్పాడు.

"తల్లీ! నువ్విప్పుడు నాతో రావడంలేదు. మరి కొన్నాళ్లు ఇక్కడే ఉండిరా. ఈ రోజు శాస్త్రిగారింట్లో నువ్వు పాడిన కీర్తన విని నా మనస్సు పులకించిపోయింది. నీలో ఇంతటి విద్వత్తు, సంగీత జ్ఞానం ఉన్నాయని నేనెప్పుడూ కలలోనైనా ఊహించలేదు. ఈ ఇంట్లో నీ గురించీ అంతా చెబుతుంటే నా కూతురు ఇంత గొప్పదా అన్న గర్వం కలుగుతోంది. ఇన్ని తెలివితేటలున్న నువ్వు మనింట్లో ఎప్పుడూ ఇంత ఆనందంగా ఉండడం చూడలేదు. దానికి కారణం నేనే. నిన్ను అన్ని కట్టుబాట్లమీద పెంచాను. ఇక నుంచి నువ్వు సంగీతం బాగా నేర్చుకో. నీకిష్టమైన చదువు చదువుకుందువుగాని. నేను చేసింది తప్పని ఈ రోజు తెలుసుకున్నాను. మరి నేను వస్తాను" అంటూ ఆయన వెళ్లిపోయారు.

ఆ మాటలు విన్న పల్లవికి ఏం జరిగిందో అర్థం కాలేదు. ఆ ఆనందంతో పెరట్లోకి వెళ్లింది. అక్కడ వాడిపోయిన పాదు తను రోజూ నీళ్లు పోయడంతో మళ్లీ చిగుళ్లు తొడగడం గమనించింది. కొత్త చిగురును చూసి ఆమె ఆనందం రెట్టింపయింది.

★



## విష్ణు సరసన ఇలియానా

ఇలియానా టాలీవుడ్‌కి గుడ్‌బై చెప్పేస్తోందనే వార్తలు జోరుగా వినిపిస్తుంటే మరో వైపు ఆమె నటించబోయే తెలుగు సినిమాల గురించిన సంగతులు కూడా వినవస్తున్నాయి. యువ హీరో విష్ణు కొత్త చిత్రంలో నాయిక ఇలియానా అని అంటున్నారు.ఈమధ్యనే స్లిమ్‌గా మారిన విష్ణు, ఇలియానా కాంబినేషన్ అంటే ప్రేక్షకుల్లో క్రేజే మరి. చౌదరి 'దేవదాసు'తో పరిచయమైన ఇలియానా మళ్లీ ఇన్నాళ్లకి అతని డైరెక్షన్‌లో నటిస్తుందన్న మాట.

